


## రువాండాలో మార్‌బర్గ్ వైరస్‌తో 15 మంది మృతి

న్యూఢిల్లీ: రువాండా సహా 17 దేశాల్లో మార్‌బర్గ్ వైరస్ అలజడి రేపుతున్నది. ఈ వైరస్ సోకడంతో ఇప్పటికే రువాండాలో 15 మంది ప్రాణాలు కోల్పోయారు. వందలాది మందికి ఈ వైరస్ సోకినట్లు అంచనా. మార్‌బర్గ్ వైరస్ వల్ల వైరల్ హెమరేజిక్ ఫీవర్ వస్తుంది. కొన్నిసార్లు రక్త నాళాలను దెబ్బతీస్తుంది. ఫలితంగా రక్తం స్రవిస్తుంది. గబ్బిలాల నుంచి మానవులకు ఈ వైరస్ సోకుతుంది. ఈ వైరస్ సోకినవారి రక్తం, లాలాజలం, మూత్రం ద్వారా ఇతరులకు వ్యాపిస్తుంది. ఈ వ్యాధితో బాధపడేవారికి తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు, వాంతులు, అతిసార వస్తాయి. ఇది తీవ్ర స్థాయికి చేరినపుడు శరీరం లోపలి భాగాల్లోనే రక్తం స్రవిస్తుంది. అవయవాలు పని చేయడం మానేస్తాయి. చివరికి రోగి మరణానికి దారి తీయవచ్చు. రువాండా సహా ఇతర దేశాలకు వెళ్లాలనుకునేవారు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులు సూచించారు.

## నేడు నికేశ్ బినామీల లాకర్లు తెలుస్తం

- నవంబర్‌లో 17 ట్రాప్‌లు, 1 అక్రమాస్తుల కేసు
- ముగ్గురికి జైలు శిక్ష, జరిమానాల విధింపు: ఏసీబీ డీజీ



హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ఏసీబీ చరిత్రలోనే రెండో అతిపెద్ద కేసుగా పరిగణిస్తున్న హేరూర్ నికేశ్‌కుమార్ ఆస్తులపై అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. నికేశ్‌కుమార్ బినామీల బ్యాంకు లాకర్లను ఇవాళ తెరుస్తారని సమాచారం. సోమవారమే లాకర్లను తెరవాలని భావించినప్పటికీ మంగళవారానికి వాయిదా వేసినట్టు ఏసీబీ వర్గాలు తెలిపాయి. ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఏసీబీ.. నికేశ్‌తో సంబంధం ఉన్న వ్యక్తులను కూడా విచారించి, అరెస్టు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిసింది. ఏసీబీ నవంబర్‌లో 17 ట్రాప్‌లతో పాటు ఆదాయానికి మించిన ఓ కేసును నమోదు చేసింది. 17 ట్రాప్‌లలో 27 ప్రభుత్వ ఉద్యోగులు, ముగ్గురు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు ఏసీబీ డీజీ విజయ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిందితులను రిమాండ్ చేసినట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులెవరైనా లంచాల కోసం వేధిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 1064కు కాల్ చేయాలని, ఎక్స్‌లో (twitter @TelanganaACB), ఫేస్‌బుక్‌లో (@telanganaacb) ప్లాట్‌ఫామ్‌లలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

## రేపే 'డీట్' ప్రారంభం

### కంపెనీలకు, నిరుద్యోగులకు మధ్య వారధి

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో అబిడ్స్‌లోని పరిశ్రమల శాఖ కార్యాలయంలో కొత్తగా ఏర్పాటు చేసిన 'డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ' (డీట్)ను సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ప్రారంభించనున్నారు. వివిధ కంపెనీలు కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలు, అప్రెంటీస్‌షిప్, ఇంటర్న్‌షిప్‌ల వివరాలను ఈ వెబ్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచుతారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులతోపాటు డిగ్రీ ఫైనల్ ఇయర్‌లో ఉన్న విద్యార్థులు ఈ పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో నమోదైన అభ్యర్థులకు కంపెనీలు తమ అవసరాలకు తగ్గట్టుగా ఉపాధి అవకాశాలు కల్పిస్తాయి. అభ్యర్థులకు కంపెనీలే నేరుగా మెసేజ్‌లు, ఈ-మెయిల్స్ పంపడంతోపాటు కాల్‌చేసి పిలుస్తాయి. 'డీట్' అనేది కంపెనీలకు, ఉద్యోగార్థులకు మధ్య వారధి లాంటిదని, ఇందులో తమ ప్రమేయం ఏమీ ఉండదని అధికారులు స్పష్టం చేశారు. 'డీట్'లో కనీసం 20 లక్షల మంది అభ్యర్థులను నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులకు 'డీట్' ఎంతో ఉపకరిస్తుందని చెప్పారు.

## శాంతియుత నిరసనకు తరలిరావాలి

కోల్‌సిటీ, డిసెంబర్ 2: ఈనెల 4న పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సీఎం యువశక్తి సభలో శాంతియుత నిరసన చేపట్టనున్నట్లు రామగుండం 25వ డివిజన్ కార్పొరేటర్ నగునూరి సుమలత రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్‌కు చెందిన యువకులు, మహిళలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. డివిజన్‌లోని రోడ్లు, డ్రైనేజీలు అస్తవ్యస్థంగా ఉన్నాయనీ, మంచినీటి సమస్య కూడా తీవ్రంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రామగుండం కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యంను సీఎం దృష్టికి తీసుకవెళ్లనున్నట్లు తెలిపారు.

## సెక్యూరిటీ సిబ్బంది కీలకం

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబర్ 2 : సింగరేణి ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ సిబ్బంది పాత్ర కీలకమని ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య అన్నారు. 7ఎల్‌ఈపీ గనిపై దొంగలు స్క్రాప్‌ను చోరీ చేస్తుండగా సింగరేణి సెక్యూరిటీ గార్డు కే. ఆనందరావు గుర్తించి ఆ సొమ్మును కాపాడారు. సోమవారం జీఎం కార్యాలయంలో ఆయనను అభినందించి నగదు ప్రోత్సాహకం అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి నెహ్రూ, అధికార ప్రతినిధి అనిల్‌కుమార్, సివిల్ డీజీఎం ధనుంజయ్, సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్, జూనియర్ ఇన్‌స్పెక్టర్ రాజయ్య పాల్గొన్నారు.

## అలవెన్సు చెల్లించాలి

రామగిరి,డిసెంబర్ 2: కట్ చేసిన అండర్ గ్రౌండ్ అలవెన్సు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వకీల్‌పల్లి గనిలో సోమవారం గని మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ విషయం జీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని గని మేనేజర్ రవికిరణ్ తెలిపారు. నాయకులు మామిడి మహేందర్, బొట్ల సంపత్, బొంత రాజు, నరేశ్, విజయ్ పాల్గొన్నారు.

## ఉద్యమకారుడికి నివాళి

పాలకుర్తి, డిసెంబర్2: కన్నాల గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు దేవీ చంద్రయ్య ఇటీవల మరణించగా, సోమవారం మాజీ జడ్పీచైర్మన్ పుట్టమధూకర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. చంద్రయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త దేవీ లక్ష్మీనర్సయ్య, నాయకులు ఎండీ ఖాదర్ పాషా, దేవిశ్రీను, కాసర్లరాజేశ్వరి దేవివినిత్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## 'బెల్ట్' తీయరేమి?

- పెద్దపల్లి జిల్లాలోనే దాదాపు 2,485 బెల్ట్ షాపులు?
- గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం
- ఎంఆర్‌పీకి మించి విక్రయాలు
- అధికారులపై విమర్శలు

పెద్దపల్లి, డిసెంబర్ 2(నమస్తే తెలంగాణ): తాము అధికారంలోకి రాగానే 'బెల్ట్‌షాపులు తీసివేస్తాం' అని ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రకటించినా, కట్టడి కాలేదని తెలుస్తున్నది. పెద్దపల్లి జిల్లాలో బెల్ట్‌దందా జోరుగా సాగుతున్నట్టు వెలుగులోకి వస్తున్నది. జిల్లాలో మొత్తం 77 వైన్ షాపులు, 15 బార్‌లు ఉండగా, బెల్ట్‌షాపులు అయితే కిరాణా షాపులలెక్క వెలిసినట్టు తెలుస్తున్నది. ఒక్కో గ్రామంలో 5 నుంచి 10కి పైగానే ఉన్నట్టు తెలుస్తుండగా, జిల్లా వ్యాప్తంగా సుమారు 2వేలకుపైగా బెల్ట్‌షాపులు ఉన్నట్లు సమాచారం. ఈ షాపుల్లో ఎంఆర్‌పీకి మించి విక్రయిస్తున్నారు. క్వార్టర్‌పై ₹30, ఆఫ్‌పై ₹50, ఫుల్‌బాటిల్‌పై ₹80 అదనంగా వసూలు చేస్తున్నారు. ఎక్కడికక్కడ వెలిసిన బెల్టుషాపులతో మందుబాబులు పొద్దంతా మత్తులోనే ఉంటున్నా.. కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయి రోడ్డునపడుతున్నా కట్టడి చేసే వారు కరువయ్యారు.నియంత్రించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని మహిళలు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు అలవి కాని హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత అమలులో విఫలమైందని విమర్శిస్తున్నారు. ఆ హామీల మాట దేవుడెరుగు.. పాలన ముందుకు సాగే పరిస్థితి లేక మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తున్నదని ఆరోపిస్తున్నారు. కనీసం బెల్ట్‌షాపులనైనా మూసేసి తమ కుటుంబాలను రోడ్డున పడకుండా చూడాలని వేడుకుంటున్నారు.

### ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే చర్యలు తప్పవు

జిల్లా వ్యాప్తంగా బెల్ట్ షాపుల కట్టడికి మా శాఖ పూర్తి స్థాయిలో పనిచేస్తున్నది. మద్యం ఎక్కడైనా ఎంఆర్‌పీకి మించి విక్రయిస్తే చర్యలు తప్పవు. అలా జరుగుతున్నట్లు మా దృష్టికి రాలేదు. ఏవైనా ఫిర్యాదులు వస్తే తప్పక చర్యలు తీసుకుంటాం.

**మహిపాల్‌రెడ్డి, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి**



విజేతలతో అధికారులు

## జిల్లా స్థాయి యువజనోత్సవాలు

పెద్దపల్లి రూరల్, డిసెంబర్ 2: పట్టణంలోని అమర్‌చంద్ కల్యాణ మండపంలో సోమవారం జిల్లా స్థాయి యువజనోత్సవాలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 180 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను విజేతలుగా నిర్ణయించి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లా స్థాయిలో జరిగిన కార్యక్రమం సంబంధిత అధికారుల ప్రచార లోపం కారణంగా అనుకున్న స్థాయిలో విజయవంతం కాలేదని పలు పాఠశాలల ఉపాధ్యాయులు, మేధావులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక ముందైనా ఇలాంటి కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## మద్యానికి బానిసై ఆత్మహత్య

పెద్దపల్లి రూరల్, డిసెంబర్ 2: రాఘవాపూర్‌కు చెందిన ఈర్ల ఓదెలు(56) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి తెలిపారు. ఎస్ఐ, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వ్యవసాయం చేసుకునే ఓదెలు పలు సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఓదెలుకు భార్య హనుమమ్మతో పాటు ఇద్దరు కొడుకులున్నారు. కొడుకు సతీశ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

## బాధ్యతల స్వీకరణ

అంతర్గాం, డిసెంబర్ 2: అంతర్గాం తహసీల్దార్‌గా తూము రవీందర్ నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ట్రాక్టర్ యజమాని నుంచి లంచం తీసుకుంటూ అంతర్గాం తహసీల్దార్ రమేశ్ ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం విధితమే. ఆయన స్థానంలో రవీందర్‌కు బాధ్యతలు అప్పగించారు. కార్యాలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిశారు.

## జిల్లాలో మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్

మంథని, డిసెంబర్2: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు మంథని హై స్కూల్‌లో గణిత ప్రతిభా పాఠవ పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు పంపించనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

ఓదెల, డిసెంబర్ 2: ఓదెల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలల పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. కనగర్తి హైస్కూల్ విద్యార్థిని గాయత్రి ప్రథమ స్థానంలో నిలవగా ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు.

ముత్తారం, డిసెంబర్ 2: ముత్తారంలో మండల స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించినట్లు ఎంఈవో ఓదెలు తెలిపారు. ఇంద్రాణి, నక్షత్ర, అశ్వంత్, అక్షయ, సాయి కీర్తన, సహస్ర విజేతలుగా నిలిచారు. వారికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. విద్యాశాఖ తరుపున రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలకు కేజీబీవీ పాఠశాల పదో తరగతి విద్యార్థిని సహస్ర ఎంపికైనట్లు ఎంఈవో తెలిపారు. ఇక్కడ తెలంగాణ గణిత ఫోరం మండల అధ్యక్షుడు నారాయణ రావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాలకుర్తి, డిసెంబర్2: గణిత ఫోరం మండల కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు గణిత టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. రుద్ర నిఖిల్, శ్రీజ, అక్షిత విజేతలుగా నిలిచారు. ఎంఈవో విమల, బసంత్‌నగర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం గాయత్రి, గణితఫోరం జిల్లా అధ్యక్షుడు పీ హరిప్రసాద్ అభినందించారు.

ధర్మారం,డిసెంబర్ 2: ధర్మారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు మండల స్థాయి గణిత ప్రతిభా పాఠవ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంఈవో చాయాదేవి, ఎంఎన్‌వో ప్రభాకర్, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. టీఎంఎఫ్ మండల బాధ్యులు వేణుగోపాల్ రెడ్డి, వెంకటేశ్వర్లు, విజయభాస్కర్, తిరుపతి, మ్యాథ్స్ టీచర్లు పాల్గొన్నారు.

కమాన్‌పూర్, డిసెంబర్ 2: కమాన్‌పూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో మండల స్థాయి గణిత ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వరుణ్, అక్షర, భూమిక మొదటి స్థానాల్లో నిల్వగా ఎంఈవో విజయకుమార్ జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. సీనియర్ ఉపాధ్యాయురాలు జీ.సరళ పరీక్ష ప్యాడ్లు అందజేశారు. కార్యక్రమంలో టీఎంఎఫ్ మండల అధ్యక్షుడు మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చొక్కారావు, గంగారం పాల్గొన్నారు.

ఎలిగేడు,డిసెంబర్ 2 : జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎలిగేడు జడ్పీహెచ్ఎస్‌లో మండలంలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పాఠవ పోటీలు నిర్వహించారు. ఇందులో జె. సంజన, బీ సాద్విక, టీ విశ్వాస్ ఎంపికైనట్లు హెచ్ఎం జీ దేవేందర్ రావు తెలిపారు. విజేతలకు ప్రశంస పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. టీఎంఎఫ్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి జీ శ్రీశైలం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామగిరి, డిసెంబర్ 2: నాగెపల్లి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన గణిత ప్రతిభా పాఠవ పోటీల్లో విద్యార్థులు సాహిత్, రిషిక, కుమార్, జెస్సీ దేవి, సుబ్బారావు ప్రతిభ చూపి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎంఈవో కొమురయ్య, హైమావతి పాల్గొన్నారు.